ప్రజాశక్తి
బుధవారం 9 ఆగస్టు 2023
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

కందిపప్పు ఏదీ ?

◆ మూడు నెలలుగా ఇవ్వని ప్రభుత్వం ◆ కొనుక్కోలేని స్థితిలో మార్కెట్ ధర

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి, కొత్తకోట విలేకరులు

మూడు నెలల నుంచి పేదలకు ప్రభుత్వం కందిపప్పు ఇవ్వడంలేదు. చౌకదుకాణాల ద్వారా బియ్యం కార్డుదారులకు ఇవ్వాల్సిన కందిపప్పును జూన్, జులై, ఆగస్టు నెలల్లో పంపిణీ చేయలేదు. పైపెచ్చు ఎప్పుడు పంపిణీ చేస్తుందనేది కూడా చెప్పడంలేదు. మే వరకూ కిలో కందిపప్పును రూ.67కు ప్రభుత్వం ఇచ్చింది. తరువాత నుంచి పంపిణీ చేయకపోవడంతో అధిక ధరలకు అమ్ముతున్న కందిపప్పును పేదలు కొనుక్కోలేకపోతున్నారు. కనిష్టంగా రూ.వంద నుంచి వాటి నాణ్యత, బ్రాండ్‌ను బట్టి రూ.200కు పైగా వుంది.



బయట మార్కెట్‌లోని ధరకు కొనుక్కోలేక అత్యధిక మంది పేదలు కందిపప్పు వాడ్డంలేదు. కొంతమంది కిలో వంద నుంచి రూ.150 రేటు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. జూన్, జులై నెలల కందిపప్పు ఆగస్టులో రేషన్‌తో కలిపి పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాగేశ్వరరావు ప్రకటించినప్పటికీ ఆగస్టులో ఇవ్వాల్సిన కందిపప్పు ఇవ్వలేదు. జిల్లాలో 5.40 లక్షల బియ్యం కార్డులున్నాయి. ప్రతి నెలా 540 మెట్రిక్ టన్నుల కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేయాల్సివుంది. ప్రతి నెలా ఎండియు వాహన నిర్వాహకులను లబ్ధిదారులు అడుగుతున్నా వారు సమాధానం చెప్పలేకపోతున్నారు. చివరకు కందిపప్పు ఎందుకు రాలేదన్న విషయం పౌర సరఫరాల శాఖాధికారులు కూడా చెప్పలేని స్థితిలో వున్నారు.

బయట కొనుక్కోలేకపోతున్నాం



రేషన్ డిపోలో కందిపప్పు కిలో రూ.70కి ఇచ్చేవారు. మూడు నెలలుగా ఇవ్వడంలేదు. మార్కెట్‌లో మొదటి రకం కందిపప్పు రూ.140గా వుంది. ఈ రేటుకు కొనుక్కొని ఏం తింటాం.

కె.రాములమ్మ,
పొర్లుపాలెం, రావికమతం మండలం

ఐదు నెలల నుంచి కందిపప్పు ఆపేశారు



రేషన్ డిపోలో కందిపప్పు కిలో రూ.67కి ఇచ్చేవారు. ఐదు నెలల నుంచి ఇవ్వడం మానేశారు. కిరాణా షాపులో కిలో కందిపప్పు రూ.90 నుంచి వంద రూపాయల మధ్య అమ్ముతున్నారు.

భూపతి నూకరత్నం,
కొండవారిపాలెం, రాంబిల్లి మండలం

వార్త మెయిన్‌లో..



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

'ఉక్కు'పై గంగవరం పోర్టు అబద్ధాలు

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు

జగన్ హయాంలో విశాఖ భక్షణ

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖను కాపాడుతానని నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన జగన్.. నేడు అదే విశాఖను దోచుకు తింటున్నారని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. వైసిపి ప్రభుత్వం విశాఖలో అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2017లో ఇదే ప్రాంతంలో సేవ్ విశాఖ పేరిట వైసిపి మిగతా 2లో..

చంద్రబాబుపై రౌడీషీట్ - మంత్రి అమర్‌నాథ్ డిమాండ్

వార్త 2లో..

క్విట్ మోడీ - సేవ్ ఇండియా దీక్షను జయప్రదంచేయాలి

వార్త 4లో..

పలుచోట్ల గద్దర్‌కు ఘన నివాళి

వార్త 2లో..



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల ఆందోళనతో అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

లోపలకు వెళ్లేందుకు ప్రయత్నం - అడ్డుకున్న పోలీసులు

వార్త 5లో..

దర్జాగా గెడ్డలు కబ్జా

◆ 95 సెంట్లు స్థలాన్ని ఆక్రమించిన వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ ◆ విలువ రూ.3 కోట్లు పైమాటే

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ నగరంలోని గాజువాక మండలం తుంగ్లాం గ్రామ రెవెన్యూ పరిధిలో వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ ఆక్రమణకు దిగింది. తన స్థలానికి ఆనుకొని ఉన్న గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు సైతం చేపట్టింది. మొత్తం 95 సెంట్లు మేర కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. దీని విలువ రూ.మూడు కోట్ల పైమాటేనని తెలుస్తోంది. ఇంత విలువైన స్థలాలను దర్జాగా తమ చేతుల్లోకి తీసుకొని నిర్మాణాలు చేపట్టడం వెనుక అధికార యంత్రాంగం సహకారం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నారు. వాస్తవానికి స్టీల్ హ్యాండ్లింగ్ లాజిస్టిక్స్‌తో పాటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ వైజాగ్ ప్రొఫైల్స్ కంపెనీ వ్యవహారాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థపై పలు విమర్శలూ లేకపోలేదు. తాజాగా గెడ్డ కబ్జా అంశం చర్చనీయాంశంగా ఉంది. వాస్తవానికి సర్వే నెంబర్ 6, 8ల్లో గెడ్డలు



ఆక్రమిత స్థలంలో సాగుతున్న నిర్మాణాలు

ఉన్నాయి. సర్వే నెంబరు 6లో 3.08 ఎకరాల్లోనూ, 8లో 2.02 ఎకరాల్లోనూ గెడ్డ విస్తరించి ఉంది. వీటిలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. సర్వే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

జగన్ హయాంలో విశాఖ భక్షణ

మహా ధర్నా చేపట్టిందని, ఆనాడు ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విశాఖను కాపాడుకోవాలని, చంద్రబాబు బినామీలను తరిమి కొట్టాలని చెప్పారని గుర్తుచేశారు. అనంతర కాలంలో అధికారంలోకి వచ్చి మాట మార్చి భూ దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. కావాలి జగన్ అన్న ప్రజలు నేడు పోవాలి జగన్ అంటున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ నలుమూలలా ఉన్న వేల కోట్ల విలువైన భూములను వైసిపి నాయకులు కొట్టేశారని అన్నారు. ముఖ్యంగా విజయసాయిరెడ్డి ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇటువంటి భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. విశాఖలో అధికార పార్టీకి చెందిన ఎంపీ కుటుంబానికి సైతం రక్షణ కరువైందని అన్నారు. వైసిపివి నవరత్నాలు కావని, నవ మోసాలని పేర్కొన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జగన్ విశాఖ రావాలని ఉవ్విళ్లూరుతున్నారని, ఆయన వస్తే ఇక్కడి ప్రజలు ఆయనను భూస్థాపితం చేస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో వైసిపి నాయకులు విశాఖ నగరంలో అన్ని మతాల వారి భూములను కబ్జా చేశారని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, టిడిపి కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

దర్గాగా గెడ్డలు కబ్జా

నెంబరు 6లో 80 సెంట్ల స్థలాన్ని సదరు సంస్థ ఆక్రమించింది. ఇక సర్వే నెంబర్ 8లో ఒక చోట 10 సెంట్లు, మరోచోట ఐదు సెంట్లు స్థలాన్ని కబ్జా చేసింది. ఈ గెడ్డలను ఆక్రమించడంతో సజావుగా నీరు ముందుకు వెళ్లే అవకాశం లేదు. వర్షాకాలంలో మరింత ఇబ్బంది ఎదురవుతుంది. భూగర్భ జలాలకూ నష్టం వాటిల్లుతుంది.

రెవెన్యూ అధికారుల అండదండలు

వైజాగ్ ప్రొఫైల్స్ నిర్వాహకులు కృష్ణారావుకు రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. గతంలో కూడా ఆయన కూర్మన్నపాలెంలో అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టినప్పుడు ఇదేవిధంగా రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు సాగించినట్టు విమర్శలు వినిపించాయి. అప్పట్లో పెద్ద ఎత్తున పత్రికల్లో వార్తలు ప్రచురితమైనా ఆయనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి వ్యవహారాన్ని చక్కబెట్టారు. పేదవాడు చిన్నపాటి జాగాలో గుడిసె వేసుకుంటే ఆగమేఘాల మీద తొలగించే రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో గెడ్డలు కబ్జాకు గురవుతున్నా కనిపించకపోవడం గమనార్హం. వైజాగ్ ప్రొఫైల్స్ ఆక్రమణలపై గాజువాక తహశీల్దారు కిరణ్ పావెల్‌ను వివరణ కోరగా దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ సర్వే నెంబరును పరిశీలిస్తామన్నారు.

చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హింసాత్మక రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, పుంగనూరులో ఆయన ఇదేవిధమైన కుట్రను అమలు చేశారని, ఈ క్రమంలో ఆయనపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం సాయంత్రం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులను రెచ్చగొట్టడం, తద్వారా వారు ఫైరింగ్ ఓపెన్ చేస్తే ఎవరో ఒకరు చనిపోతే తమ పార్టీ కార్యకర్తలను అన్యాయంగా చంపారంటూ ఒక డ్రామాతో రాజకీయ లబ్ధి పొందాలనేది బాబు రాజకీయ పన్నాగమని అన్నారు. పోలీసులు ఒక వైపు దెబ్బలు తింటున్నా ఎక్కడా సంయమనం కోల్పోకుండా నిబద్ధతతో విధులు నిర్వహించారని చెప్పారు. దీంతో చంద్రబాబు దుష్టాలోచన పారలేదన్నారు. పుంగనూరు బైపాస్‌లో పోలీసులపై టిడిపి దాడికి ముమ్మాటికీ చంద్రబాబునే కారకుడని, ఈ కేసులో అతనే ప్రథమ ముద్దాయి అని తెలిపారు. అధికారం దక్కించుకోవడానికి చంద్రబాబు ఎంత నీచానికైనా దిగజారుతాడనేది మరోమారు స్పష్టమైందన్నారు. పుంగనూరులో అంతపెద్ద ఘటన జరిగినప్పుడు అందుకు కారణమైన వ్యక్తి ఎవరు.? ఏ విధంగా ప్లాన్ చేశారు ? ఎందువల్ల ఈ ఘటన జరిగింది ? అనే అంశాలపై మీడియా ఆలోచన చేయాలన్నారు.

విశాఖలో గద్దర్‌కు ఘన నివాళి

విశాఖ జిల్లాలో ప్రజా గాయకుడు గద్దర్‌కు పలు ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ఘన నివాళ్లర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

ఎంవిపి.కాలనీ : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయు మానవ వనరుల అభివృద్ధి శాఖ సెమినార్ హాల్‌లో సంతాప సభ నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి.పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు పాల్గొన్నారు. **కలెక్టరేట్ :** ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు పలు పౌర, ప్రజా సంఘాలు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నివాళ్లర్పించాయి. పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐద్వా నాయకులు మణి, సిపిఐ (ఎంఎల్) ప్రజా పోరు ప్రతినిధి దేవా, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు వై.నూకరాజు, రాం ప్రభు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు కె.నిర్మల, సుజాత, పిఒడబ్ల్యు ప్రతినిధి బాలనాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ప్రజా గాయకుడు గద్దర్ మృతిపట్ల విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు మంగళవారం స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్ జంక్షన్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువరానిదన్నారు. స్టీల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కెఎస్ఎన్.రావు మాట్లాడుతూ, ప్రజా చైతన్యం కోసం గద్దర్ జీవితాంతం కృషిచేశారన్నారు. పోరాట కమిటీ ప్రతినిధులు గణపతిరెడ్డి, రామ్మోహన్‌కుమార్, సురేష్‌బాబు, పరంధామయ్య, టి.జగదీష్, ఒబిసి అధ్యక్షులు బి.అప్పారావు, ఎస్సీ ఎస్టీ అధ్యక్షులు భయ్యే మల్లయ్య మాట్లాడుతూ, గద్దర్ తన పాటతో, ఆటతో ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలకు ఊపిరి అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కామేష్, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్టు లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రధానమంత్రి స్వానిధి కార్యక్రమానికి సంబంధించి ఆయన ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి జోన్ - 4 సమావేశ మందిరంలో వీధి విక్రయదారులకు రుణాలు మంజూరు అంశంపై సమావేశం నిర్వహించారు. జివిఎంసి పరిధిలో ఉన్న చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు వర్తకులకు మొదటి విడతగా రూ.10 వేలు, రెండో విడతగా రూ.20 వేలు, మూడో విడతగా రూ.50 వేలు రుణాలు బ్యాంకుల ద్వారా అందించనున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. సకాలంలో రుణాలను పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జోన్ 4 జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, యుసిడి పథక సంచాలకులు, ఇన్‌ఛార్జిలు లక్ష్మి, రామలక్ష్మి, డివైపిఒ శైలజ, టిడిఎఫ్ఒ పుణ్యవతి, నాగరాజు, రమేష్, లలిత పాల్గొన్నారు.

నేటి నుంచి పంచాయతీల్లో 'నా మట్టి - నా దేశం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ అన్ని పంచాయతీలు, వార్డులు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమంపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో వెబెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. అలాగే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటిపై జెండా ఎగరవేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ బడిపై విలీన ప్రభావం

▶▶ తగ్గిన విద్యార్థులు

▶▶ మారిన 3 ఏకోపాధ్యాయ పాఠశాలలు

▶▶ నూతన విద్యా విధానం అమలు ఫలితమే ఇది..!



3, 4, 5 తరగతుల విలీనంతో ఏకోపాధ్యాయ పాఠశాలగా మారిన పైలపేట స్కూల్

ప్రజాశక్తి -భీమునిపట్నం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం అమలు ఫలితంగా ప్రభుత్వ విద్యారంగం నేడు దీనా వస్తకు చేరిందని పలువురు విద్యారంగ నిపుణులు, ఆ రంగంలో నిష్ణాతులై ఉన్న మేధావులు అంటున్నారు. నూతన విద్యా విధానానికి కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసినప్పుడే దీని దుష్పరిణామాలను విద్యారంగ మేధావులు అంచనా వేశారు. అయినా సరే కేంద్రం పెడచెవిన పెట్టింది. ఈ విధానాన్ని ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం భుజానికెత్తుకొని అమలుకు పూనుకుంది.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో సరిపడా విద్యార్థులు లేక భీమునిపట్నం మండలంలో 3 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. అన్నవరం పంచాయతీ పైలపేట, చిప్పాడ, మంగమారిపేట ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధించే పరిస్థితి ఉంది. ఉపాధ్యాయుడు సెలవు పెడితే బడి మూయాల్సిన దుస్థితి ఉంది. విద్యా సంబంధిత సమావేశాలకు టీచర్ వెళ్తే బడి నడిచే పరిస్థితి ఉండదు.

ప్రభుత్వ బడిపై విలీన ప్రభావం తీవ్రం...

"ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు మధ్య కిలోమీటరు దూరం ఉంటే గనుక అప్పటికే ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను యుపి లేదా ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలి" అని నూతన విద్యా విధానంలో పొందుపర్చారు. అందుకు అనుగుణంగానే మండలంలోని 6 ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతులు, కిలోమీటరు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనమయ్యాయి. అన్నవరం పంచాయతీ పైలపేటలో 12 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు యుపి పాఠశాలకు బదిలీ అయ్యారు. వారుంటున్న ఇళ్ల నుంచి వెళ్లేందుకు యుపి పాఠశాల దూరంగా ఉండడంతో పిల్లల తల్లి దండ్రులు దగ్గర్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం 12 మంది 1, 2 తరగతుల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలోనే ఉన్నారు. వాస్తవంగా గతంలో రెట్టింపు సంఖ్యలో ఉండే విద్యార్థులు ప్రస్తుతం సగానికి తగ్గిపోయారు .

చిప్పాడ ప్రాథమిక పాఠశాలలో 21 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు, అదే పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం 10 మంది 1,2 తరగతుల విద్యార్థులు మాత్రమే ఉన్నారు. గతంలో ఇక్కడ కూడా రెట్టింపు సంఖ్యలో విద్యార్థులు ఉండేవారు. మజ్జిపేట ప్రాథమిక పాఠశాలలో ఉండే 61 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో 21 మంది 1, 2 తరగతుల విద్యార్థులున్నారు. గత ఏడాది 121 మంది విద్యార్థులు ఉండేవారు. మంగమారి పేట ప్రాథమిక పాఠశాలలో 45 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో 19 మంది 1,2 తరగతుల విద్యార్థులున్నారు. అమనాం ప్రాథమిక పాఠశాలలో 52 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఉన్నత పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేనందున ప్రస్తుతం వారు ప్రాథమిక పాఠశాలలోనే ఉంటున్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అక్కడకు వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. 32 మంది 1, 2 తరగతుల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో ఉన్నారు. తాటితూరు ప్రాథమిక పాఠశాలలో 65 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు, ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు చదువుకున్న ప్రాథమిక పాఠశాలకు, వారుంటున్న ఇళ్లకు ఉన్నత పాఠశాల దూరం కావడం, పక్కనే గోస్తనీ ఉండడంతో పిల్లలను పంపించేందుకు ఎక్కువ మంది తల్లి దండ్రులు ఇష్టపడలేదు. 40 మంది 1, 2 తరగతుల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో ఉన్నారు

కార్పొరేట్ బడులతో పోటీ ఇలాగేనా?

'విద్యార్థులకు జెవికె కిట్లు ఇస్తున్నాం.. బడుల్లో స్మార్ట్ టీవీ లు పెడుతున్నాం.. 1-10 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు పాఠ్యాంశాలతో బైలింగ్వల్ (ద్వి భాష పద్ధతిలో) విధానంలో భోధన.. నాడు.. నేడుతో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులు బాగు చేశాం..' అంటూ తరచూ పాలకులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న 3, 4, 5 తరగతులను యుపి, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశాక అప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రయివేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇలాగేనా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల అభివృద్ధి? అని పలువురు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉండదు.

నేరాలు ఘోరాలు

ఘోర రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి - నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ సాగర తీరం రోడ్డు మార్గంలో సోమవారం రాత్రి ఓ కారు సృష్టించిన బీభత్సంలో మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. యువకులు మద్యం మత్తు, అతివేగం ఈ ప్రమాదానికి కారణమైంది. ఆరిలోవ సిఐ సోమశేఖర్ కథనం ప్రకారం... జోడుగుళ్ళ పాలెం నుంచి ఎండాడ వైపు వెళ్తున్న కారు రాడిసన్ బ్లూ హోటల్ మలుపు వద్ద అదుపు తప్పింది. రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి తరువాత చెట్టును ఢీకొంటూ అవతలివైపునకు దూసుకు పోయింది. ఆ దారిలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న పృధ్వీరాజు, ప్రియాంక శామల్ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. పృధ్వీరాజ్ ఒడిశా రాష్ట్రం రాయఘడ ప్రాంతానికి చెందినవాడు కాగా ప్రియాంక శామల్ శ్రీకాకుళం జిల్లా మిలియపుట్టి మండలం, నందచంద్ర గ్రామానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ స్నేహితులు. ప్రమాదానికి కారణమైన కారులో పిఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన మణికుమార్, వినయ్, నగరంలోని ఊర్వశి ప్రాంతానికి చెందిన బాలు, రవి కిరణ్, పలా ప్రాంతానికి చెందిన రవి, భరత్ మొత్తం ఆరుగురు యువకులు ప్రయాణిస్తున్నారు. వీరిలో వెనుక సీట్లో కూర్చున్న పిఎంపాలెం, ఆర్‌హెచ్‌కాలనీకి చెందిన మణికుమార్ తీవ్రంగా గాయపడి కారులోనే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో యువకుడు జానా రవికిరణ్(20) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆరిలోవ సిఐ సోమశేఖర్ ఆధ్వర్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-సీతమ్మధార : షార్ట్ సర్క్యూట్ వల్ల సుబ్బలక్ష్మి కల్యాణ మండపం వద్ద ఉన్న సచివాలయం పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అర్బన్ తహశీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. కొన్ని ఫైళ్లు కూడా కాలిపోయినట్లు చెప్పారు. కాలిన సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీం, వీఆర్వోలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : మీడియా రంగంలో చోటుచుసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులతో విసి మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడారు. జర్నలిజం కోర్సు పూర్తిచేసే నాటికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం పూర్తిచేసిన విద్యార్థులు స్టార్టప్ సంస్థలను ప్రారంభిస్తే తాము అవకాశం ఇస్తామన్నారు. ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో వీరికి అవసరమైన వసతులు కల్పించి, మార్గదర్శకం అందిస్తామని చెప్పారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏయూ లుక్స్ సంచికల రూపకల్పనలో జర్నలిజం విద్యార్థులు భాగం కావాలని సూచించారు. త్వరలో వంద సంవత్సరాల వేడుకను జరుపుకుంటున్న ఆంధ్రవిశ్వవిద్యాలయంలో యువత భాగస్వామ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థీ ప్రత్యక్షంగా ఎయు కళాశాలలు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులకు సంబంధించిన ఆసక్తిదాయక ప్రత్యేక కథనాలను అందించాలని సూచించాను. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం దీనిలో స్వీకరిస్తామన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో మృతిచెందిన అనాథకు పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన మంగళవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. స్థానిక ఎంఐజి కాలనీలోని రోడ్డుపై ఓ వ్యక్తి మృతి చెందాడన్న సమాచారంతో ట్రస్టు వ్యవస్థాపకులు, 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ అక్కడకు చేరుకున్నారు. మల్కాపురం ఎస్ఐ నాగరాజు పర్యవేక్షణలో మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి సురేష్ సొంత నిధులతో ఆఖరి మజిలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం ఎయు హెచ్‌ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక అభివృద్ధికి దోహదకారిగా నిలవాలని సూచించారు. విద్యార్థిలో లోపాలను ఎత్తిచూపకుండా వారిని సరిదిద్ది మార్గదర్శకం అందించే బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. అధ్యాపకులు సామాజిక ఇంజినీర్లుగా నిలుస్తారన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను నిస్వార్థంగా మీ కళాశాలలో విద్యార్థులకు చేరువచేసే దిశగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో విద్యార్థులను అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య టివి.కృష్ణ, ఆచార్య ఎన్ఎడి. పాల్ తదితరులు పాల్గొన్నారు.

250 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సోంత్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 250 మీటర్ల జాతీయ జెండాను విద్యార్థులు ఉపాధ్యాయులు తయారుచేశారు. జాతీయ జెండా గొప్పతనాన్ని వివరిస్తూ, స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల త్యాగాలు, పోరాట ఫలాలు నేటి తరానికి అర్థమయ్యేలా, దేశభక్తిని ద్విగుణీకృతం చేసేలా, ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు వినూత్నంగా అన్ని శాఖల అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులతో కలిసి 250 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లెంక రాంబాబు, సర్పంచ్ లెంక లావణ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొద్దపు బంగార్రాజు, ఎంపిటిసి సభ్యులు పల్లా దుర్గ, నాయకులు కోరాడ వెంకటరమణారావు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాకర సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు జోగారావు, మేము సైతం వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిరెడ్డి దేవుడుబాబు, యోగా గురువు కట్టమూరు బాలభాను, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు కన్నారావు పాల్గొన్నారు.



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

వార్డు మెంబర్ల ఎన్నికల షెడ్యూల్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని మూడు గ్రామపంచాయతీల్లో వార్డు మెంబర్ల ఎన్నిక ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి అయిన ఎంపిడిఒ లవరాజు విడుదలచేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఆనందపురం మండలం వెల్లంకి - 2, పాలవలస - 1, కణమం - 1 గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు, 11న నామినేషన్ల పరిశీలన, 12న నామినేషన్ల తిరస్కరణపై అపీల్, 13న నామినేషన్లు పరిష్కారంపై అపీల్, 14న నామినేషన్లు ఉపసంహరణ, 19వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఎన్నిక ఉంటుందని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో నోటిఫికేషన్ బోర్డును ఏర్పాటుచేశారు. వెల్లంకి గ్రామ సచివాలయంలో విఆర్ఒ అప్పలరెడ్డి ఎన్నికల నోటీసు బోర్డు ఏర్పాటుచేశారు.

భీమిలిలో తొలి రోజు నామినేషన్లు నిల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ స్థానానికి, టి.నగరపాలెం పదో వార్డు స్థానానికి ఈ నెల 19న జరుగనున్న ఉప ఎన్నికలకు సంబందించి మంగళ వారం నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రారంభం కాగా రెండు చోట్లా ఎవరూ నామినేషన్ దాఖలు చెయ్యలేదు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో నామినేషన్ పత్రాల స్వీకరణ నిమిత్తం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మండల ఇంజినీరింగ్ అధికారి కె.రాజేష్ పట్నాయక్ వ్యవహరించారు.

38జె బస్సు పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి- ములగాడ : 38జె బస్సులను పునరుద్ధరించడంపై ఆర్‌టిసి యాజమాన్యానికి సిపిఎం, గ్రామ, యువజన, మహిళా సంఘాలు ధన్యావాదాలు తెలిపాయి. గత 25 సంవత్సరాల నుంచి ఆర్‌టిసి 38జె బస్సులను కొండ ప్రాంతాల మీదుగా కోరమండల్ గేటు, జోహార్‌నగర్, జనతాకాలనీ మీదుగా త్రినాధపురం వరకు నడిపిస్తోంది. బస్సులకు ఈ రూట్లో ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్నందున నెల రోజుల క్రితం నుంచి ఆర్‌టిసి బస్సులను నిలుపుదల చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని బస్సులను నడపాలని సిపిఎం, గ్రామ సంఘాలు, డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యాన ఆర్‌టిసి గాజువాక డిపో మేనేజర్‌కు వినతి పత్రాలను సమర్పించారు. సిపిఎం ఆధ్వర్యాన డిపో వద్ద ధర్నా కూడా చేశారు. దీంతో ఆర్‌టిసి యాజమాన్యం స్పందించి బస్సులను మంగళవారం ఉదయం నుంచి జనతా కాలనీ మీదుగా పునరుద్ధరించారు. దీనికి ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు, విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు. ఈ బస్సులను క్రాంతినగర్ మీదుగా కాకరలోవ వరకు పొడిగించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కోరారు.

మాజీ కార్పొరేటర్ వెంగళరావు మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి మాజీ కార్పొరేటర్, దళిత నాయకులు కొల్లాబత్తుల వెంగళరావు మతి చెందారు. మంగళవారం అయన పార్థివ దేహాన్ని ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, అనీల్‌రాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.



వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ గోవింద్

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి మధురానగర్ హైస్కూల్‌లో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ద్వారా బాలింతలకు, గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని భావించి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేముడుబాబు, వైద్యాధికారి సత్య కార్తీక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్యామల మృతి మిస్టరీని ఛేదించలేరా?

ప్రజాశక్తి-సీతమ్మధార : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మళ్ళ శ్యామల అనుమానాస్పదంగా మృతి చెంది మూడేళ్ళు పూర్తయినా నేటికీ మిస్టరీని ఛేదించకపోవడం ప్రభుత్వ, పోలీసుల పనితీరుకి అద్దం పడుతోందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఎద్దేవాచేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వైద్యురాలిది హత్యా, ఆత్మహత్య అనే అంశంపై నిగ్గు తేల్చాల్సిన పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారని, సంఘటనను ఎందుకు మిస్టరీగా మిగిల్చారని ప్రశ్నించారు. పోలీసుల అలసత్వానికి ఒక కుటుంబం నష్టపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 2020 ఆగస్టు 4 డాక్టర్ శ్యామల విధులకు బయలుదేరి అదే రోజు తాళ్లపాలెం దగ్గర నిర్మాణంలో ఉన్న పోలవరం వాటర్ స్టోరేజీ కెనాల్లో ఆమె మృతిచెంది ఉన్నారని, అడుగు నీరు కూడా లేని చోట ఆమె ఎలా చనిపోయారని ప్రశ్నించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇంకా దర్యాప్తు కొనసాగించడం విడ్డురంగా ఉందని పేర్కొన్నారు. పోలీసులకు ప్రభుత్వానికి డాక్టర్ శ్యామల మృతి అంతుచిక్కని పరిస్థితి ఉంటే సిట్‌కు అప్పగించాలని భీశెట్టి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్యామల భర్త స్వామినాయుడు, లోక్ సత్తాపార్టీ నాయకులు ఎమ్ఎస్ఎన్.మూర్తి, వడ్డే హరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్విట్ మోడీ - సేవ్ ఇండియా దీక్షను జయప్రదంచేయాలి



ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : క్విట్ ఇండియా స్ఫూర్తితో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం 'క్విట్ మోడీ- సేవ్ ఇండియా' నినాదంతో కార్మిక సంఘాల ఆధ్వర్యాన జరిగే నిరసన దీక్షను జయప్రదం చేయాలని కోరుతూ హెచ్‌పిసిఎల్ కల్యాణ్ గేటు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు మాట్లాడుతూ, 9 సంవత్సరాల మోడీ పాలనలో కార్మిక సమస్యలు ఏమీ పరిష్కారం కాలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలుకు పెంచాలన్న డిమాండ్‌ను పెడచెవి పెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐయన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు, సిఐటియు జిల్లా నాయకులు పూడి పైడిరాజు, ఎఐటియుసి జిల్లా నాయుకులు కె.సత్యనారాయణ, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయుకులు ఎం.కృష్ణారావు, జి.నరేష్, రాజేష్, తాతబాబు, నర్సింగ్, భూలోక, కృష్ణ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 'క్విట్ మోడీ- సేవ్ ఇండియా' పేరుతో జరుగుతున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు కోరారు. ఆగస్టు 9 క్విట్ ఇండియా స్ఫూర్తితో మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకునేందుకు మహా ధర్నాకు కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే దీక్షను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : 'క్విట్ మోడీ- సేవ్ ఇండియా' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి జోన్-2 కార్యాలయం నుంచి మధురవాడ వంతెన మీదుగా మార్కెట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి నుంచి కార్మిక, ప్రజల హక్కులను పోరాటాల ద్వారా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా 'క్విట్ మోడీ- సేవ్ ఇండియా' పేరిట జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవి.ప్రసాద్, డి.అప్పలరాజు, ఎస్.రానప్పుడు, సిహెచ్.శేషుబాబు, కె.నాగరాజు, కె.రాజు, నక్క అప్పారావు, ఎం.లలిత, కేర్జునమ్మ, నరేంద్ర, బి.అప్పారావు, యు.ఉమ, పి.నర్సిగ్‌రెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన క్విట్ కార్పొరేట్.. సేవ్ ఇండియా కార్యక్రమాలకు కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాడు క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టి బ్రిటిష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టినట్టే, నేడు మోడీ అనుసరిస్తున్న కార్మిక కర్షక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ వ్యవసాయం, పరిశ్రమలను దోచుపెట్టేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్

అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు

కార్యాలయాల వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిషన్ మోర్చా నాయకులు ఎ.బాలకృష్ణ, పిఎస్.అజయ్ కుమార్, జి నాయన బాబు, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : జీవీఎంసీ మున్సిపల్ కార్మికుల సమావేశం మంగళవారం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకర్రావు మాట్లాడుతూ ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. కార్మికులకు నష్టం కలిగించే 4 కార్మిక కోడ్ తీసుకువచ్చారని, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 9న జరుగు మహాధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు గంటా



అనకాపల్లిలో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా నాయకులు

శ్రీరామ్, జీవీఎంసీ కాంటాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాము, నూకరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్ వద్ద క్విట్ మోడీ - సేవ్ ఇండియా కార్యక్రమం చేపట్టారు. ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారినుద్దేశించి సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడారు. చిన్న చిన్న వ్యాపార సంస్థలను నిర్వీర్యం చేస్తూ ముఠా కార్మికులకు ఉపాధి లేకుండా చేయడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తగదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు ఎం.సుబ్బారావు, రామారావు, శ్రీనివాసు, పైడిరాజు, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్, కుమార్ పాల్గొన్నారు.



మధురవాడలో ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్



పూర్ణామార్కెట్ వద్ద నిరసన

బాలల అరెస్టు చూపకుండా నిర్బంధిస్తే చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : బాలలను వివిధ కేసుల్లో అదుపులోకి తీసుకొని అరెస్టు చూపకుండా రోజులు తరబడి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించే పోలీసులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్ట ప్రకారం చర్యలతో పాటు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక కేసులో పోలీసులు ముగ్గురు బాలలను అదుపులోకి తీసుకొని అరెస్టులు చూపకుండా రోజుల తరబడి కస్టడిలో ఉంచుకున్నట్టు వివిధ దిన పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటాగా తీసుకున్న గొండు సీతారాం మంగళవారం ఆ స్టేషన్‌ను సందర్శించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి స్టేషన్‌ను పరిశీలించారు. ముగ్గురు బాలలు ఒక గదిలో ఉండడాన్ని గమనించారు. ఏ కేసు విషయంలో, ఎన్ని రోజుల క్రితం స్టేషన్‌కు తీసుకొచ్చారు, వారి వయసెంత, శరీరంపై దెబ్బలేమైనా ఉన్నాయా, బెదిరింపులకు పాల్పడ్డారా, పోలీసులు లాఠి ప్రయోగాలు చేశారా, ఫలహారాలు, భోజనం ఏర్పాట్ల గురించి బాలలనడిగి సీతారాం తెలుసుకున్నారు. మంగళవారం ఉదయమే అదుపులోకి తీసుకున్నట్టు మైనర్లు, పోలీసులు చెబుతున్నారు. బాలల తల్లిదండ్రులకు ఫోన్ చేసి వారిని పోలీసులు ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారో అడిగారు. శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారని, విచారణ పేరుతో అరెస్టులు చూపకుండా నిర్బంధించారని వాపోయారు. అరెస్టుపై పిల్లలు, పోలీసులు చెబుతున్న విషయానికి, తల్లిదండ్రుల చెప్పిన అంశాలకు పొంతన లేకపోవడంతో సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వీరిని జెజెబి కోర్ట్ ముందు హాజరు పర్చి సంబంధిత నివేదికను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు సమర్పించాలని నగర పోలీసు కమిషనర్‌కు ఆదేశాలు జారీచేస్తున్నట్టు చెప్పారు. కమిషన్ సభ్యుని వెంట జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, డిపిఒ శరత్, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, పిఒఐసి.మమతా, లీగల్ కం ప్రొబేషన్ అధికారి అనీజ, 1098 చైల్డ్ లైన్ ప్రతినిధి శారద,బి.శకుంతల,పి. శేఖర్,లవకుశ,హరీష్ తదితరులున్నారు.

12 నుంచి ఎఐటియుసి జిల్లా మహాసభలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నగరంలో ఈ నెల 12వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎఐటియుసి జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కాంట్రాక్ట్ వర్కర్స్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం ఎఐటియుసి జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ఎఐటియుసి ఏర్పాటైన నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన రాజీలేని పోరు సాగిస్తోందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, సిహెచ్.పెంటారావు, వై.దేముళ్లు పాల్గొన్నారు.

విఆర్ఎల ఆందోళనతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

లోపలకు వెళ్లేందుకు ప్రయత్నం అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఏ) సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటల దీక్షలు సందర్భంగా రెండో రోజు మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. తమ సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించేందుకు వీఆర్ఏలు కలెక్టరేట్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో డిఆర్ఓ వెంకటరమణ బయటకు వచ్చి వీఆర్ఏల సమస్యలను తెలుసుకున్నారు. వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వీఆర్ఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా తాత్సారం చేయడంతో 36 గంటల నిరసన దీక్ష చేపట్టినట్లు చెప్పారు. వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలని, నామిని వీఆర్ఏలను రెగ్యులర్ చేసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిఎల్ఓ డ్యూటీలు నుంచి మినహాయించాలని, చనిపోయిన వీఆర్ఏ కుటుంబంలో ఒకరికి వీఆర్ఏ పోస్టు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి ఎం సంతోష్ కుమార్, పరదేశి నాయుడు, నరేంద్ర, నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సన్యాసిరావు, లావరాజ్, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి కలెక్టరేట్ లోపలకు వెళ్తున్న విఆర్ఎలను అడ్డుకుంటున్న పోలీసులు

విశాఖ కలెక్టరేట్ : గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన ధర్నా మంగళవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినీగా ఉన్న విఆర్ఎలను రెగ్యులర్ చేయాలన్నారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని, చనిపోయిన విఆర్ఎ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా విఆర్ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీతాలను రూ.26 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ అలమండ సత్యం, ఆనందపురం మండల అధ్యక్షులు అప్పలస్వామి, పద్మనాభం మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సాధు, కెవి.సూర్యనారాయణ, విశాఖ అర్బన్ మండలం నుంచి అనపర్తి శంకరమ్మ, శంకరరావు, 11 మండలాల విఆర్ఎలు పాల్గొన్నారు. వీరి పోరాటానికి సిఐటియు నగర కార్యదర్శి బి.జగన్ మద్దతు తెలిపారు.


విశాఖలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి


శారదా నదిపై వంతెన నిర్మాణానికి ఎంపీ నిధులు ఖర్చుకు వినతి

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట గ్రామం వద్ద శారదానదిపై పెదగుమ్మం వంతెన బాట నిర్మాణానికి సుమారు 2.85 లక్షల నిధులను తన ఎంపీ నిధులు నుండి వినియోగానికి అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్రం స్టాటిస్టిక్స్ అండ్ కార్పొరేట్ వ్యవహారాల మంత్రి ఇందర్ జీత్ సింగ్‌కు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి వినతిపత్రం అందజేశారు. కశింకోట గ్రామస్తులు వ్యవసాయ కార్యకలాపాలు, పశువుల పెంపకం, సాగు కోసం శారదా నదిని దాటి వెళ్లాల్సి వస్తుందని, వర్షాకాలంలో ఈ నది దాటడం చాలా ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. అనేక విషాద సంఘటనలు, ప్రాణనష్టం జరిగాయని తెలిపారు. ఈ ఫుట్ బ్రిడ్జి నిర్మాణం జరగకపోవడంతో స్థానిక ప్రజలు నది దాటడానికి దోనెలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.

చెక్కుల అందజేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామానికి చెందిన శ్రీవిశ్వబ్రాహ్మణ, శ్రీవిశ్వకర్మ, శ్రీకామాక్షి దేవి జాయింట్ లైబిలిటీ గ్రూపులకు రూ.2.50 లక్షలు చొప్పున మూడు చెక్కులను డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం తారువలోని తన కార్యాలయంలో అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వేచలపు లక్ష్మణ ప్రమాదవశాత్తు మృతి చెందగా అతని భార్య అరుణకి లక్ష రూపాయల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శరారి నాయుడు, బ్యాంక్ చైర్మన్ రెడ్డి వెంకటకృష్ణ నాయుడు, మైచర్ల నారాయణరావు, వేచలపు సూరిబాబు, పిఎసిఎస్ సీఈవో మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


బీమా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం బూడి


మాక్ అసెంబ్లీలో పాల్గొన్న ఉషోదయ కళాశాల విద్యార్థులు

హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-చోడవరం : ప్రతి ఒక్క విద్యార్థికీ హక్కులు, చట్టాలు, ప్రభుత్వాల పని విధానంపై అవగాహన కలిగి ఉండాలని ఉషోదయ డిగ్రీ కళాశాల చైర్మన్ జె.రమణాజీ అన్నారు. 76వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉషోదయ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మంత్రులు, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, స్పీకర్, ప్రతిపక్షం, అధికారపక్షం వంటి వాటి గూర్చి విద్యార్థులకు అవగాహన కలిగేలా మాట్లాడించారు. అనంతరం రమణాజీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ వెంకట వాసు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన త్వరితగతిన పూర్తి

ప్రజాశక్తి-సబ్బవరం : నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.సత్యపద్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనలో వాలంటీర్లను వెంటపెట్టుకొని వెళ్లవద్దని ఆదేశించారు. ఈ నెల21 లోగా ఓటర్ల జాబితాల పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, బిఎల్ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యపద్మ

77వ స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 15న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే వేడుకలను పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మైదానంలో ఏర్పాట్లను పోలీస్ శాఖ, జిల్లా రెవెన్యూ అధికారి, సౌండ్ సిస్టం ఏర్పాట్లను సమాచార శాఖ డిఐపిఆర్ఓ పర్యవేక్షించాలని సూచించారు. వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధికారి, తాగునీరు శానిటేషన్ జీవీఎంసీ జోనల్ కమిషనర్, డిపిఓ పర్యవేక్షిస్తారని చెప్పారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, తాగునీటి సరఫరా, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య, పట్టణాభివృద్ధి, డ్వామా, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖలు జిల్లాలో ఆయా శాఖల అభివృద్ధిని తెలియపరిచే శకటాలను ప్రదర్శించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మెరిట్ సర్టిఫికెట్లను పర్యవేక్షిస్తారని, ముఖ్య ప్రణాళిక అధికారి, జిఎస్‌డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి కార్యక్రమాల అనుసంధాన, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

19న వార్డు స్థానాలకు ఉప ఎన్నికలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎన్.గజపతినగరంలో మూడో వార్డుకు, నాగయ్యపేట పంచాయతీలో 7వ వార్డుకు ఈ నెల 19న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి నోటిఫికేషన్ వివరాలను మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వేలాడదీశారు. మంగళవారం నుంచి ఈనెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారని, ఉపసంహరణ 14 మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉందని, అనంతరం అభ్యర్థుల ప్రకటిస్తామని, 19న పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కె.కోటపాడు ఈవోపీఆర్డీ పీవీఎస్ ప్రసాద్‌ను నియమించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ జివి రమణ, మండల ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ సంతోషి నళిని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం


ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీ 20వ వార్డు పరిధి పెద్దపల్లిలో గత శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఆటో డ్రైవర్ బొద్దపునాయుడుకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో ఆ కుటుంబానికి ఆటో డ్రైవర్లు సుమారు 40 మంది కలిసి రూ.20వేలు నగదు, నిత్యవసర సరుకులు, బట్టలు మంగళవారం అందజేశారు. బాధిత కుటుంబం యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక పశువులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూరె బాబురావు, పశు వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ప్రజాసేవ ముఖ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు : రాజకీయాల్లో ప్రజాసేవ ప్రతిబింబిస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని కె సంతపాలెం చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కె కోటపాడు, దేవరాపల్లి మండలం పాస్టర్స్ ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. కీర్తిశేషులు బర్నబాసు కుమారుడు ప్రశాంత్ ఆహ్వానం మేరకు ఇందులో పాల్గొన్న పైలా మాట్లాడుతూ కొందరు ఆలయాలు, చర్చిల నిర్మాణానికి విరాళాలు ఇవ్వడం తప్పితే తనకు రాజకీయాలు తెలియవని వ్యాఖ్యానిస్తున్నారని, అలాంటి వారు రాజకీయాల అసలు అర్థం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక, విద్యా, క్రీడా, సాంస్కృతిక వికాసం ఫరిడవిల్లితేనే అన్ని వర్గాలకు సంక్షేమం అంది సుఖ శాంతులతో జీవిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు పాల్గొన్నారు


పైలా ప్రసాదరావుకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పారిశుధ్యం మెరుగుపర్చాలని వినతి

ప్రజాశక్తి-రాంబిల్లి : గ్రామాలలో డెంగ్యూ, మలేరియా టైఫాయిడ్ వంటి విష జ్వరాల నుండి ప్రజలను కాపాడాలని, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, దోమలను నివారించాలని సిపిఎం నాయకులు మంగళవారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేముడు నాయుడు మాట్లాడుతూ మండలంలో కొత్తపట్నం, ఒడ సర్పాపురం, వెంకయ్యపాలెం, రాంబిల్లి, వైలవ, నేవీ కాలనీ తదితర గ్రామాలలో పారిశుద్యం లోపించి వర్షపు నీరు ఇళ్లల్లో వాడుకునే నీళ్లు నిల్వ ఉంటుందని తెలిపారు. దోమలు విపరీతంగా పెరిగి, డెంగీ, మలేరియా టైఫాయిడ్ వంటి ప్రాణాంతకమైన జరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నేవీ నిర్మాణ కార్మికులు, వెంకయ్యపాలెం మరికొన్ని గ్రామాలలో ప్రజలు చనిపోతున్నారని వివరించారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని, జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శివాజీ పాల్గొన్నారు.

కూండ్రం హైస్కూల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా విద్యా శాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ మంగళవారం కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. అక్కడ 3, 4, 5, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్ధ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఇరువురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బైజూస్, ఐఎఫ్‌పిఎస్, స్మార్ట్ టివిల ద్వారా బోధన చేస్తున్న విధానం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శం

ప్రజాశక్తి-అనకాపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శం చేసుకొని ముందుకు సాగాలని పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ సంస్థ నిర్వాహకులు పిఎంఎల్ నరసింహం అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవితంపై క్విజ్ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న విద్యుత్ ఉద్యోగుల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10 విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద జరుగు మహాధర్నాకు విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని ఎపి విద్యుత్ ఉద్యోగుల జెఎసి కమిటీ సభ్యుడు వేపాడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాదయాత్రలో విద్యుత్ కార్మికుల సమస్యలపై జగన్మోహన్‌రెడ్డి చేసిన చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యరావు, ప్రేమ చంద్రశేఖర్ శ్రీనివాసరావు, అచ్చం నాయుడు, అవతారం, ఎల్ రామకృష్ణ, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ పలక యశోద రవి అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం మంగళవారం యశోద రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ అభివృద్ధికి తీసుకోవలసిన పలు విషయాలపై చర్చించి తీర్మానాలు చేశారు. మార్కెట్ యార్డుకు ఇటీవల కాలంలో బెల్లం తక్కువగా వచ్చినందున, మార్కెట్‌కు తేవడం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి డి శకుంతల, కమిటీ ఉపాధ్యక్షులు కరక సోమినాయుడు, మెంబర్లు నీలిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తులసి కుమారి, బొడ్డు అచ్చిరాజు, పిట్ల అప్పలరాజు, తెరపల్లి నాగ సంతోష్ కుమార్, దాడి కుమారుడా కృష్ణ, ఒమ్మి మెధుబాబు, కొణతాల విజయ్ కుమారి, గుండా రమేష్ గుప్తా, గొంతిన శివ, ఏడి అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసులు 4వ విడతలో రికవరీ చేసిన 235 (రూ.43 లక్షల విలువగల) మొబైల్ ఫోన్లను మంగళవారం ఎస్పీ మురళీకృష్ణ బాధితులకు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమం ద్వారా బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్ సిఇఐఆర్ https://www.ceir.gov.in లో మీ పోయిన మొబైల్ ఫోన్ వివరాలు అందించవచ్చని తెలిపారు. ఆపై వెంటనే ఐటీ కోర్ బృందం ట్రేస్ చేస్తూ బాధితులకు మొబైల్స్ అందజేసేందుకు కృషి చేస్తుందని చెప్పారు. మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 95052 00100కు హాయ్ టైప్ చేయడం ద్వారా akpmobiletracker.in లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేసిన జిల్లా పోలీసులు, మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి. విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఐటి కోర్ ఎస్సై రఘు వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

సర్పంచ్ ఏకగ్రీవానికి మొగ్గు

బాధిత కుటుంబానికి అవకాశం ఇవ్వాలని గ్రామస్తుల తీర్మానం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలో ఏకగ్రీవానికి గ్రామ పెద్దలు, వైసిపి, టిడిపి నాయకులు మొగ్గు చూపారు. 2022 నవంబరు 17వ తేదీన బుచ్చయ్యపేట సర్పంచ్ సుంకర సూరిబాబు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 8, 9, 10 తేదీలలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో గ్రామ పెద్దలు టిడిపి, వైసిపి నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం వైసిపి నాయకులు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల ఇన్‌ఛార్జి గేదెల శేషు తదితరులు గ్రామంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలతో స్థానిక పాల సంఘ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో సర్పంచిగా ఎన్నికై మృతి చెందిన సుంకర సూరిబాబు కుటుంబానికే సర్పంచ్‌గా అవకాశం ఇవ్వాలని తీర్మానం చేసుకొని సూరిబాబు భార్య లక్ష్మికి సర్పంచ్‌గా అవకాశం ఇస్తున్నట్లు మద్దతు తెలిపారు. దీంతో సర్పంచ్ ఎన్నిక లాంచన ప్రాయమే. సూరిబాబు భార్య లక్ష్మి గురువారం నామినేషన్ వేయడానికి ఇరు పార్టీల నాయకులు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమిష్టిగా పని చేయాలి

ప్రజాశక్తి -కె.కోటపాడు : టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కింతాడ పంచాయతీ శివారు మెరకరామచంద్రపురంలో మంగళవారం టిడిపి 9వ క్లస్టర్ సమావేశం జరిగింది. కె.కోటపాడు-1 క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నూరు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుమార్ మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన బస్సు యాత్రను, క్లస్టర్ సమావేశాన్ని విజయవంతం చేసిన కన్నూరు సూర్యనారాయణను కుమార్, టిడిపి నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు అభినందించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగలి మహేష్, మాజీ జెడ్‌పిటిసీలు కళిరెడ్డి అప్పలనాయుడు పోలుపర్తి సత్యవతి, టిడిపి నాయకులు కన్నూరు నాగభూషణం, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణమూర్తి, బోలెం బుల్లిదొర, యడ్ల రమేష్, లెక్కల చంద్రరావు, రెడ్డి ప్రభాకరరావు, యాళ్ల నాయుడు, సింగంపల్లి నారాయణమూర్తి, చీపురుపల్లి రామారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. పార్టీ కార్యాలయంలో చోడవరం పట్టణ వాలంటీర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందాలని, అందుకోసం ప్రతి వాలంటీరు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యరావు, పంచాయతీ ఈవో నారాయణరావు, ఓరుగంటి నెహ్రూ, బైన ఈశ్వరరావు దేవరపల్లి సత్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేక్ సెమినార్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం డైట్ కళాశాల నిర్వహించే నేక్ సెమినార్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ యుజిసి నేక్ ద్వారా కళాశాల అంతర్గత నాణ్యత హామీ కేంద్రం ఆధ్వర్యంలో "ఊహించబడిన ఫలితం కోసం బోధనాపరమైన పద్ధతులపై నాణ్యత అంకురార్పణం" అనే కార్యక్రమం ఈ నెల 11, 12 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుండి అధ్యాపకులు హాజరు అవుతారన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అధ్యాపకులు డాక్టర్ కే.పార్వతి, కే.ఈశ్వరరావు, ఏ.కృష్ణ నాగ్, డాక్టర్ కే.సుజాత, డాక్టర్ కే.గోపాలమ్మ, డాక్టర్ పి పూర్ణ ప్రియ, డాక్టర్ పిబి.రామ్ కుమార్ పాల్గొన్నారు.

సిసి డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని గొలగాం గ్రామ శివారు కొత్త తలారివానిపాలెంలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.20 లక్షలతో సీసీ మెయిన్ డ్రైన్ నిర్మాణానికి ఎంపీపీ సూరిబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. గొలగాం సర్పంచ్ సలపరెడ్డి లక్ష్మీనరసింహ, వార్డు మెంబర్ కరెడ్ల శ్రీను, కార్యదర్శి కోసిరెడ్డి కనకబాబు, వేపాడ సంతోష్, నారపిన్ని మాధవ, ఏఈ కుమార్ రాజా, తలారి గణేష్, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మీ రామకృష్ణ, పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన షేక్ అబ్దుల్లా

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి జిల్లాకు ప్రభుత్వ ఖాజీగా నియమితులైన చీడికాడకు చెందిన షేక్ అబ్దుల్లా మంగళవారం తారువలోని డిప్యూటీ సీయం క్యాంప్ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అబ్దుల్లాను మంత్రి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాజుబాబు, సుంకర శ్రీనివాస్, వైస్ ఎంపిపి కొండబాబు, ఉన్నిసా, చీడికాడ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధా వెంకన్న జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్ద వెంకన్న జన్మదిన వేడుకలు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు యువత నాయకులు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు ఆడారి కన్నబాబు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, మల్లవరపు నరసింహారావు, దాడి శివ, దొడ్డి రమేష్, ఆడారి లక్ష్మణరావు, బొడ్డేడ ప్రసాద్, ఆడారి గోవిందా, కోరుకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ

లిక్విడేషన్ ఉత్తర్వులు సస్పెండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వివి రమణ సహకార చక్కెర కర్మాగారం (తమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ) లిక్విడేషన్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీ లిక్విడేషన్‌పై రైతులతో కలిసి బుద్ద నాగ జగదీష్ కోర్టు ఆశ్రయించారు. న్యాయం చేస్తామన్న వాగ్దానం నిలబెట్టుకున్నానని, 13,500 మంది రైతులకు అన్యాయం జరగకుండా స్టే తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ లిక్విడేషన్ ద్వారా కాజేయాలనుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కుట్రని తిప్పి కొట్టినట్లు అయిందని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై టిడిపి వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉపాధ్యాయుల సమస్యలపై అనకాపల్లి జిల్లా డీఈవో కార్యాలయంలో మంగళవారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతికి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల అనకాపల్లి జిల్లాలో 1200 ఉపాధ్యాయులను ఏజెన్సీలోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసిన ప్రభుత్వం, వారికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. వైసిపీ ప్రభుత్వం ఇప్పటికీ ఉద్యోగులపై కక్ష సాధింపు ధోరణితోనే వ్యవహరిస్తుందని ఆరోపించారు. తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదని, పోరాటాలకు పిలుపునిస్తే ముందస్తుగా గృహ నిర్బంధాలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖపై అవగాహన లేని బొత్స సత్యనారాయణ అనుచిత నిర్ణయాల వలన ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తక్షణమే ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, కోట్ని రామకృష్ణ, బుద్ద కాశీ, కాంగ్రేగుల సత్యనారాయణ, మల్ల గణేష్, బోడి వెంకటరావు, సిమ్మిటి రామకృష్ణ, బుద్ద భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం- తట్టబంద, సీతయ్యపేట హైస్కూల్ నుండి రాజుపాలెం వరకు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సీతయ్యపేట రోడ్డు నుండి పిపి అగ్రహారం, రాజుపాలెం గ్రామాలకు రాకపోకలకు ఈ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 30 లక్షల రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేయడంతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం కంకరతో రోడ్డు లెవెలింగ్ పనులు జరుగుతున్నాయి. ఎట్టికెలకు రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-చోడవరం : కేన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చోడవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి కానరాని భూతములా క్యాన్సర్ వ్యాధి తయారైందన్నారు. వ్యాధిని సరైన సమయంలో గుర్తించినట్లయితే దీనిని నివారించడం సులువు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, లక్ష్మీ యూనిట్ సభ్యులు పిచ్చమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు. క్విట్ ఇండియా సందర్భంగా విద్యార్థులతో సదస్సు నిర్వహించి దేశ స్వాతంత్ర ఉద్యమ చరిత్రను ప్రిన్సిపల్ మాట్లాడారు.

పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద గల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు చేతులు మీదుగా గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లును మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు చింతకాయల ముత్యాలరాణి, సూరాడ మహేశ్వరి, సూరాడ రమాదేవి, సమ్మంగి ముత్యాలమ్మ , నాయకులు పాల్గొన్నారు.



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుజాత ముత్యాలు

ఓటర్ల సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఇంటింటా ఓటర్ల సర్వేకు రాజకీయ పక్షాల నేతలు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ తహశీల్దార్లు, పలు రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెల 21 నుండి ప్రారంభమైన ఓటర్ జాబితా ఇంటింటా సర్వే పక్కాగా జరిగే విధంగా చూడాలన్నారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆధారాలు ఉంటేనే మరణించిన ఓట్లను తొలగించకూడదని సూచించారు.కొత్త ఓట్ల నమోదు కూడా పక్కాగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్‌లు అంబేద్కర్, జయప్రకాశ్, జానకమ్మ, విజయ్ కుమార్ పాల్గొన్నారు .



మాడుగులలో మాట్లాడుతున్న ఆర్‌ఓ



నక్కపల్లిలో మాట్లాడుతున్న రామలక్ష్మి

కోటవురట్ల:మండలంలో ఇంటింటికి చేపడుతున్న ఓటర్ సర్వే వేగవంతంగా సాగుతుంది. ఈనెల 21 నాటికి సర్వే నిర్వహణ పూర్తి కావాల్సి ఉండటంతో సోమవారం వీఆర్వో రామలక్ష్మి నిర్వహించిన సమీక్ష సమావేశం తో మండల వ్యాప్తంగా సర్వేను సిబ్బంది వేగవంతం చేస్తున్నారు. మంగళవారం నాటికి తహసిల్దార్ జానికమ్మ ఇచ్చిన సమాచారం మేరకు మండలంలో 52 పోలింగ్ స్టేషన్ల లో ఫారం6- 162 దరఖాస్తులు, ఫారం7- 59 దరఖాస్తులు, ఫారం8- 265 దరఖాస్తులు, ఫారం8 లో షిఫ్టింగ్ 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

మాడుగుల:ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు సక్రమంగా చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిత కోరారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన రాజకీయ పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతూ, బిఎల్ఓలు కొద్ది కాలంగా ఓటర్ల నమోదులో భాగంగా చిరునామాల ధృవీకరణ, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు రాజారామ్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జగ్గారావు, పుప్పాల రమేష్, బిజెపి నేత రాజు తదితరులు పాల్గొన్నారు. జనసేన, సీపీఐ తదితర పార్టీలకు సమాచారం ఇవ్వలేదు.



పరీక్షలు చేస్తున్న వైద్యు సిబ్బంది

100 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - చీడికాడ:ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని ఉప సర్పంచ్, మండల సచివాలయ కన్వీనర్ ఈర్లీ చైతన్య కోరారు. మండలంలో జైతవరం గ్రామంలో ఎల్‌వి ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వ్యక్తి చనిపోయిన తర్వాత 9 గంటలు వరకు కళ్లను దానం చేయవచ్చని తెలిపారు. గ్రామంలో సుమారు 20 మంది యువకులు నేత్రదానానికి అంగీకార పత్రాలు అందజేశారు. ఈ శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, శిబిరం కోఆర్డినేటర్ స్వాములు, సిబ్బంది సీతారాం, లీలావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు భూపతి, సంతోష్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల:వెంకటాపురానికి తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం వైసిపి విభాగపు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పైల రమేష్, చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివరాంలు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావును కోరారు. అసంపూర్తిగా పనులు నిర్వహించడంతో గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. అదేవిధంగా రోడ్లు ధ్వంసం చేసి వదిలేయడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కవగుంట గ్రామపంచాయతీ రెండవ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి కంటముకి జానకి మంగళవారం ఎన్నికల నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చైతన్య, ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. కవగుంట గ్రామపంచాయతీ రెండవ వార్డ్‌లో గెలుపొందిన కంఠముఖి శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది.ఈ కార్యక్రమంలో కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, ఈవోపీఆర్డి శ్రీనివాసరావు, కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

పాల సేకరణ పెంచాలి

విశాఖ డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ

ప్రజాశక్తి -నక్కపల్లి :విశాఖ డెయిరీకి పాల సేకరణ పెంపునకు వేతన కార్యదర్శులు, పాల సొసైటీల అధ్యక్షులు కృషి చేయాలని డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ సూచించారు. మండలంలోని చినదొడ్డిగల్లు బీసీసీ ఆధ్వర్యంలో వేతన కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులతో కలిసి మంగళవారం రేబాకలోని గూడుపమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ పాడి రైతుల అభ్యున్నతకు ఎంతగానో కృషి చేస్తుందన్నారు. పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు.ప్రతి సెంటర్ లోనూ పాల సేకరణ పెంచాలన్నారు. కళ్యాణ మండపాలు నిర్మాణాలు, బోర్లు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల సొసైటీ అధ్యక్షులు కోరారు. రెడ్డి రామకృష్ణ , తుని యూనిట్ మేనేజర్ శ్రీను, సూపర్వైజర్ కిరణ్, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీలను వేతన కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేబాక పంచాయతీ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, న్యాయంపూడి సర్పంచ్ వరహాలబాబు, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు, ఉపమాక పాల సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, సూపర్వైజర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ



నినాదాలు చేస్తున్న గిరిజనులు

గిరిజనుల రిలే దీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల:అణుకు గిరిజన ప్రాంతానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న గిరిజనులు తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు డేవిడ్ రాజు, గ్రామానికి చెందిన పలువురు మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు వేలంపాట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఒడిమెట్ట గ్రామంలో లక్ష్మీ గణపతి దేవస్థానంలో ఈనెల 9న బుధవారం టెండరు కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరిశే వెంకటేశ్వరరావు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 18వ తేదీ నుండి 26 వ తేదీ వరకు భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కల హక్కునకు, పూజా సామాగ్రి అమ్ము కొను హక్కు పొందేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించ నున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనదల చిన వారు ప్రథమ ధరావత్తుగా రూ. 25,000 లు చెల్లించి పాల్గొనాలని, హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము చెల్లించాలన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం సర్పంచ్ రోహిణి భర్త తళ్ళ భార్గవ్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు చేతుల మీదుగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హెూమ్ రేషన్ కిట్లను గర్భిణీలకు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గర్భిణీ, బాలింతలలో రక్తహీనత లోపించకుండా పోషకా హారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల విశిష్టత పై అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తళ్ళ అప్పలస్వామి, పుణ్యమంతుల బాబ్జి, అంగన్వాడి కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10 నుంచి విశాఖలో వారాహి యాత్ర

ప్రజాశక్తి-మాడుగుల: విశాఖలో పవన్ కళ్యాణ్ చేపడుతున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన నేత రాయపు రెడ్డి కృష్ణ కోరారు. మంగళవారం ఘాట్ రోడ్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈనెల 10 నుండి 19 వరకు పవన్ కళ్యాణ్ విశాఖలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని వినతి పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. భూకబ్జాలు, ఇసుక దోపిడీలపై ప్రసంగిస్తారన్నారు. మాడుగుల నియోజక వర్గంలో జరుగుతున్న ఇసుక దోపిడీ, ఇతర అవినీతి పై ఇప్పటికే ఆయనకు వివరించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జన సేన నేతలు గట్టి రామారావు, గుమ్మాల నానాజీ, కోన శ్రీను, గత్రెడ్డి శివాజీ, చింతలూరు మూర్తి, కొట్ని రమేష్, సాయం రమేష్, పడాల చాణక్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:

పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు డి.గోపీనాథ్ ఆధ్వర్యంలో గొలుగొండ మండల నూతన మండల అధ్యక్షులుగా జి.శ్రీరామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎ.రమణమూర్తి ఎన్నికయ్యారు. వారికి నియామక పత్రంను అందించి జిల్లా అధ్యక్షులు గోపినాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కురచా రమణ, పి.ఎ.దొరబాబు, ఎంఎస్.ప్రసాద్, నాగభూషణం, గోవిందుమాస్టారు, సంబరాజు, బి.అప్పారావు, నాగేశ్వరరావు, నరసింహ పాల్గొన్నారు.

చురుగ్గా జల జీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి-రోలుగుంట:

మండలంలో బిబి.పట్నం గ్రామంలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటా కొళాయిలకు రూ.39లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ గరగ సర్వేశ్వరరావు తెలిపారు. గ్రామంలో మెయిన్ రోడ్డు ఒక వైపు పైపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్యాంక్ పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయని, కుళాయిలు ఇంకా వేయలేదని ఆయన తెలిపారు.



నిర్మాణంలో ఉన్న ట్యాంకు , పైప్ లైన్

పోటీ పరీక్షల శిక్షణలో వీనస్ సత్తా

-ప్రతి ఏటా పలువురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-మాడుగుల:ఒకరు కాదు.. ఇద్దరు కాదు 135 మంది విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో అర్హత సాధించి ఉన్నత విద్యలో చేరారు. అనేకమంది కొలువులు సాధించారు. మాడుగులకు చెందిన వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాపపురెడ్డి నాగ చంద్ర శిక్షణలో వీళ్లంతా ఫలితాలు సాధించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసి ,వేదాంత పవర్ ప్లాంట్‌లో ప్లానింగ్ ఇంజనీర్‌గా చేరి, వేలాది రూపాయలు జీతం తీసుకున్న తాపపురెడ్డి నాగ చంద్ర స్వగ్రామంలో విద్యార్థులకు తక్కువ ఖర్చుతో శిక్షణ ఇచ్చి, వారిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రామానికి చేరుకుని 2019లో వీనస్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. 2019 -20లో ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు పలు ప్రవేశ పరీక్షలకు అర్హత సాధించారు. ఏపిఆర్ఎస్‌లో 22 మంది శిక్షణ తీసుకోగా 17 మంది ఎంపిక అయ్యారు. ట్రిపుల్ ఐటీకి 5 గురు, అగ్రికల్చర్ ఇద్దరు, హార్టికల్చర్‌కు ఒకరు ఎంపిక అయ్యారు. పాలిసెట్ కు 10 మంది, మోడల్ స్కూల్‌కు ఐదుగురు ఎంపిక అయ్యారు. 2020-21లో ఏపిఆర్ఎస్‌కు ముగ్గురు, మోడల్ స్కూల్‌కు ఏడుగురు, పాలీసెట్‌కు 18, అగ్రికల్చర్ 5, ఏపీ ఆర్ జె సికు ఇద్దరు, ట్రిపుల్ ఐటీ కి ఇద్దరు ఎంపిక అయ్యారు. 2021 -22 లో సైనిక స్కూల్‌కు ముగ్గురు, ఎన్ఎంఎంఎస్‌కు ఒకరు, ఏపి ఆర్ఎస్ కు ముగ్గురు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కు 14 మంది, ఏపీ ఆర్‌జెసికు ముగ్గురు, ట్రిపుల్ ఐటీ కి ఒకరు, అగ్రికల్చర్‌కు ఐదుగురు, హార్టికల్చర్ కు ఇద్దరు, 2022 -23 లో సైనిక స్కూల్ కు ముగ్గురు, ఏపిఆర్ ఎస్ కు ఇద్దరు, ఏపిఆర్ జె సి కు ఇద్దరు ఎన్ఎంఎంఎస్‌కు ఒకరు, ట్రిపుల్ ఐటీ కి ఇద్దరు ఎంపిక అయ్యారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారు. ఇదిలా వుండగా ఈ కోచింగ్ సెంటర్ విద్యార్థులు క్రీడల్లో సైతం సత్తా చూపుతున్నారు. చెస్‌లో రాష్ట్ర స్థాయి బంగారు పతకాలు పొందిన నలుగురు విద్యార్థులు నాగ చంద్ర శిక్షణలో అంతర్జాతీయ చెస్ పోటీలకు ఎంపిక అయ్యారు. పలు పోటీ పరీక్షలకు శిక్షణ పొందడానికి లక్షలాది రూపాయలు అవసరం కాగా, అతి తక్కువ ఫీజు తో శిక్షణ ఇచ్చి ఇప్పటి వరకు 135 మంది విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి కారణం అయిన నాగ చంద్ర కు పలువురు అభినందనలు చెపుతున్నారు.


విద్యార్థులను అబినందిస్తున్న నిర్వాహకులు నాగచంద్ర


మృతి చెందిన పశువులు

విష ప్రయోగంతో పశువులు మృతి

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం దొండపూడి గ్రామంలో మూగ జీవులపై విషప్రయోగం చేశారు. దీంతో ఓ రైతుకు చెందిన దుక్కిటెద్దు, ఆవు దూడ సోమవారం రాత్రి మృతి చెందాయి. సదరు రైతుకు రూ.లక్ష పైగా నష్టం వాటిల్లింది. ఎవ్వరో విషప్రయోగం చేసి తన జీవనా ధారమైన పశువులను చంపేశారంటూ గ్రామానికి చెందిన గడ్డి రాజునాయుడు కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. రాజునాయుడు ఇటీవలే రూ. లక్షా 10 వేలు వెచ్చించి జత దుక్కిటెడ్లును కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ముమ్మర వ్యవసాయ పనుల్లో ఉన్నాడు. దుక్కిటెడ్లులో ఒక ఎద్దుకు రెండు రోజులుగా ఆరోగ్యం బాగలేక పోవడంతో వైద్యం చేయిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఎప్పటి మాదిరిగా ఎడ్లుకు, దూడకు గోలెంలో దాణా వేసి మేపిన కాసేపటికే మృతి చెందాయి.దీంతో రాజు నాయుడు రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయాడు. "సమీప రైతులు గమనించి రాజునాయుడుకు సపర్యలు చేశారు. గోలెంను పరిశీలించగా. అందులో విషం కలిపినట్టుగా తెలిసింది.పోలీసులు సంఘటణా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తకోట ఎస్ఐ విభూషణరావు తెలిపారు.


ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా ఘటాల పండగ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో మంగళవారం స్థానిక కొబ్బరి తోట వీధి భక్తులు మోదకొండమ్మ ఘటాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో ఘటాలు, ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమం కొబ్బరి తోట వీధి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.


విధులు బహిష్కరించిన పారిశుద్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:తమకు బకాయి ఉన్న మూడు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం పారిశుద్య కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్య కార్మికులు మాట్లాడుతూ, సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా బకాయి జీతాలు చెల్లించాలని కోరారు.

నేడు గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో కొత్తయల్ల వరం ఇనాం భూములు సర్వేకు ఈ నెల 9న గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తున్నామని ఎంపిడిఓ డేవిడ్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవు తారని ఆయన తెలిపారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని..

4 కిలోమీటర్లు ఆదివాసీల డోలీయాత్ర

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో అర్ల నుండి పెద్దగరువు, పిత్రుగెడ్డ, జజులబంద కొందశికర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాలుగు కిలో మీటర్లు డోలి యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ నీలబంద గ్రామం నుంచి ప్రారంభమైన పిత్రుగెడ్డ, పెద్దగరువు గ్రామాలు మీదుగా జాజులబంద గ్రామం వరకు సాగింది. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, ఎస్టీ కొందు తెగ 300 మంది కొండపై జీవిస్తున్నామని, గత 2020 సంవత్సరంలో ఇంటికి రూ.10వేల చొప్పున చందాలు వేసుకొని రూ.7లక్షలతో రోడ్డు నిర్మాణం చేసుకున్నామన్నారు. ఆ రోడ్డు వర్షాల కారణంగా కొట్టుకు పోయిందన్నారు. అనారోగ్యం వచ్చినా డోలి మోతలు తప్పడం లేదన్నారు. ఇటీవల కుంబర్ల గ్రామానికి చెందిన పాంగి రోజా అడవి మార్గంలోనే చనిపోయిందన్నారు. తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.


డోలీ యాత్ర నిర్వహిస్తున్న గిరిజనులు

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల:ఎనీమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కొండబాబు ఆధ్వర్యంలో విద్యార్థునులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌వి జయమ్మ మాట్లాడుతూ,ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు సంవత్సరాల పిల్లలు, బాలింతలకు వివిధ పరీక్షలు నిర్వహించి 12 గ్రాములు కంటే రక్తహీనత లోపించిన వారికి ఐరన్ టాబ్లెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు.వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం పై అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కామాక్షి, మరియమ్మ పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వాలంటీర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ:ఒంటరి మహిళను ఓ వాలంటీర్ ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన ఒక మహిళ భర్తతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటుంది. అదే గ్రామానికి చెందిన వాలంటీర్ శివప్రసాద్ ప్రేమ పేరుతో ఆమెను నమ్మించాడు. మూడేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగించి ఇప్పుడు ముఖం చాటేశాడు. దీంతో ఆమె న్యాయం చేయాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌చార్జ్ ఎస్సై ధనుంజయనాయుడు కేసు నమోదు చేశారు.

నిరాడంబరంగా డాక్టర్ పివిఆర్ జన్మదిన వేడుకలు

- పలుచోట్ల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో ప్రముఖ వైద్యాలయమైన కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి జన్మదిన వేడుకలు ఆ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం నిరాడంబరంగా జరిగాయి. నగరానికి చెందిన అధికారులు, అనధికారులు, వివిధ పార్టీల రాజకీయ ప్రముఖులు డాక్టర్ పివిఆర్‌కు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డు పరిధిలో ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద ఎల్లా రాజు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పివిఆర్ మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకొని పివిఆర్ గ్రూపు సభ్యులు సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అందరి అభిమానాలతో మున్ముందు ప్రజా జీవితంలో మరిన్ని సహాయ సహకార కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. డాక్టర్ పివిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో గ్రేటర్ విశాఖ 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సబ్బవరం మండల వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద, బొగ్గు శ్రీను, తదితరులు ఉన్నారు.


అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ పివి.రమణమూర్తి